

# చిల్లర్ని ఎన్నో చల్లన్నా!

అవసరాల రామకృష్ణారావు

సిగరెట్టు మీద సిగరెట్టు తగలేస్తు న్నాను.

పెట్టెలకు పెట్టెలే ఊదిపారేస్తున్నాను. నా ఆలోచన మాత్రం తెగడంలేదు. ఎప్పుడూ బిజీగా ఉండడమే నాకు అలవాటు.

ఇలాంటి గజిబిజి ఆలోచనల్లో చిక్కుకుంటానని ఎప్పుడూ అనుకోలేదు. పని వాళ్ల ఎదురుచూ సే, ముసలాళ్ళు అసూయ పడే, తారుణ్యం నాది. ఇంగ్లీషు సినిమా హీరోలు సిగ్గుపడే దేహధారుడ్యం నాది.

తెల్లారింది మొదలు రాత్రి ఎప్పుడౌ తుందా, రాత్రయింది మొదలు రస రాజ్యడోలలో ఎప్పుడు మునిగి తేలు దామా అని ఇరవై నాల్గుగంటలూ కొట్టుకుపోయే కొదమ సింహాన్ని నేను.

నాలో నేను అనుకోవడంలో తప్పే ముంది!

కాలేజీలో చదివే రోజుల్లోనే ఈ జ్వాల నాలో మొదలయింది.

మొదట్లో ఏదో తప్పు జరుగుతుందేమో అనిపించేది.

హాస్టల్ మేట్స్‌ని పరిశీలిస్తే, నలుగురితో డిస్కస్ చేస్తే, మంచి సెక్సు పుస్తకాలు చదివితే, ఇది సహజమూ ఆరోగ్యకరమూ అని తెలిసింది. గర్ల్ ఫ్రెండ్స్‌ని వెదుక్కొని పబ్బం గడుపుకునే శక్తియుక్తులు ఆ రోజుల్లో మా గ్రూప్‌కి లేవు. అనుభవజ్ఞుల అడుగుజాడల్లో కొందరు కాల్‌గర్ల్‌తో కాలక్షేపం చెయ్యలేదని ఇప్పుడు అనుకుని నన్ను నేను మోసపుచ్చుకోలేను.

ఏవో కక్కుర్తి పనులు తప్ప ఏం అనుభవాలు అవి!

ఎవరైనా చూస్తున్నారేమో అని భయం.

తప్పుచేస్తున్నామనే బెంగ.

శరీరంలో ఎక్కడ ఏ కాస్త మార్పు కనబడినా, ఏ రోగం అంటుకుందో అని దిగులు.

తప్పని పరిస్థితిలో డాక్టర్లని దర్శించుకోడం. వాళ్ళ క్రూయల్ జోక్సు ఇంజక్షన్లు. ఇన్ని జరిగినా ఎప్పట్లా మళ్ళీ వయసు సందడి. మనసు అల్లరి. సుఖంతో క్రీడలు. వెలుగులో పీడలు.

గృహస్థునై, రెండేళ్ళ సంసార సౌభాగ్యం రెండు చేతులా జుర్రుకొంటున్న నాకీ నట్టింట. ఆ పాడు తలపులు దేనికి!

కట్టుకున్నది మగాడి అవసరం గమనించక పోయాక ఇలాంటి పక్కదార్ల వైపు మనసు మళ్ళకేం చేస్తుంది!

ఇంతకి దొడ్డిదారిన గడ్డి తిని రావడం తప్పు పెళ్ళి ముందు అనుభవాలతో కొల్లగొట్టుకునేది ఏముంది!

'వెల కాంత లెందరైనను కుల కాంతకు సాటిరారు గువ్వల చెన్నా!' అనేది నీతిగా బాగానే ఉంటుంది గాని అనుభూతిలోకి ఎందరికి వస్తుంది! మాట వరసకి హేవలాక్ ఎల్లిస్ ఏమన్నాడు!

'పెళ్ళి ముందు వేశ్యా సంపర్కం మగాడి సంసార జీవితానికి ఎంతగా పనికొస్తుందనేది ఏ విధంగా చూసినా అనుమానాస్పదమే. అలాంటి అనుభవాలున్న మగాడికి తన భార్య శృంగార స్పందన సాధారణంగా సరిఅయిన అంచనాకి దోహదం చెయ్యదు. రెండు తప్పుడు భావనల పట్ల అతడు కొట్టుమిట్టాడుతూ ఉంటాడు. ఏది చెబితే దానికి నిమషాల మీద ఒడబడే మైనం ముద్దులా ఉండేదిటి ఈ పల్లెటూరు మొద్దు!' అనే అభిప్రాయానికి గాని నేనో బజారు సరుకుని. ఈవిడో దేవతా మూర్తి' అనే మరో భావనకి గాని రావొచ్చు. ఎందులో నిమగ్నమయినా దానికి అవిజ్ఞ సిద్ధంచెయ్యడం గాని అందులో తృప్తం చెయ్యడం గాని అతడు జయప్రదంగా నిర్వహించలేడు.'

అనుభవజ్ఞులు కాచి వడబోసిన కటిక నిజాలు కాదనేవారెవరు! కాని అవి ఎంత వరకూ నా అనుభవంలోకి వచ్చాయనేది వేరేమాట. అలాంటి వేపీ దరిదాపులకి రానివ్వనంతటి చాతుర్యంతో సంసార సుఖమే నిజ స్వర్గసీమగా ఇన్నాళ్లూ తీర్చిదిద్దిన నా భార్య మాధురికి మాత్రం నా అణువణువూ రుణపడి ఉంటుంది.

నా ఆలోచనలోకి 'ఇన్నాళ్లూ' అనే పదం జొరబడినందుకు గుర్తింపుగా నా మనసు ముడుచుకుపోయింది.

అదెన్నాళ్లో కాకపోవచ్చు. కేవలం రెండేళ్లే అయి ఉండొచ్చు.

రెండే రెండు క్షణాలలో దొర్లి పోయింది!

ఇంతకీ కన్నెమీద కన్నేసి, కావా లని చెప్పే ధైర్యం నా కెక్కడిది!

అమ్మా నాన్నా ఇష్టపడిన పిల్లకే మూడు ముళ్ళూ వేశాను.

కొన్ని చేదు అనుభవాలకి మరిన్ని చిలిపి ఊహలు జతచేసి ఏమో ఎలా ఉంటుందో రొమాన్సూ రెస్పాన్సూ అని ఆ మూణ్ణిద్రల దాకా కిందా మీదా పడుతూనే ఉంది మాయదారి మనసు.

తల్లిదండ్రులు సాంప్రదాయం, కట్నం కానుకలూ చూసుకుంటారు. వధూ వరులు పెళ్ళి చూపుల్లో మహా అయితే మొహమొహాలు చూసుకుంటారు.

పైకి కనిపించే ఒంటి రంగూ, ఒడ్డూపొడుగూ, ముఖకవళికలూ కొంత వరకైనా అంచనా వేసుకుంటారు.

ఎంతగా ముందడుగు వేశామని వాచి పోయేలా భుజాలు చరచుకున్నా సంసార జీవితానికి మూల కేంద్రమని అంగీక రించబడిన సెక్సు మీద తమ అభి ప్రాయాలు ప్రకటించి పరస్పరం అవ గాహన చేసుకునే అవకాశం ఎంతమంది యువతీయువకులకి వారి పెద్దలు ఇస్తు న్నారు? అలా ఇమ్మని ఎంతమంది వారి పెద్దల్ని అడుగుతున్నారు! పురో హితులు ఆశీర్వదించినా పెద్దలు దీవిం చినా వేడుకగా వివాహం జరిగినా స్నేహితులెన్నో ఎన్నో కానుకలు చది వించినా, మొదటి రాత్రి తెలుసుకోవల సింది తెలుసుకోవలసిందే కేవలం వాళ్ళి ద్దరే కదా! పెడదారి పట్టించే పత్రికలూ టీవీ షోలూ సినిమాలూ తప్ప వాళ్లకి శృంగార జీవితం గురించి ముందుగా ఎవరేం చెప్పేరు గనక. ఇప్పటికీ 'సెక్సు ఎడ్యుకేషన్ అవసరమా!' అనే వాదనలు జరుగుతున్నాయి. ఇంకా నయం 'ఆహారం అవసరమా!' 'సెక్సు అవసరమా' అన్నారు కాదు! ఈ నాలు గైదు రోజులై ఇలా పిచ్చెత్తినట్టు సిగ రెట్లు తగలేసి బుర్ర పాడుచేసుకుంటు న్నాను గాని,నిజానికి ఇన్నాళ్లూ ఇలాంటి వాటికి నాకు తీరికేది!

ఇంతకీ నా అదృష్టం. ఏనాడో చేసుకున్న పుణ్యం.

మాధురి ఇలా మా యింట్లో అడుగు

పెట్టింది, నా శృంగార జీవితంలో ఒక్కసారి మాలతి విరబూసినట్టయింది. మా వాళ్ళు తెలిసి తెస్తేనేం తెలీక జతచేస్తేనేం —మా అత్తామామలు నేర్పిస్తేనేం, పుట్టుకతో వచ్చి లోకాన్ని చూసి నేర్చుకుంటేనేం—ఏ రాత్రికి ఆ రాత్రి నా బతుకులో నిండు సుగంధం. నిత్య వసంతం.

మా వాళ్ళు ఆ పల్లెటూరు వదిలి రారు. నన్ను విడిచి మాట వరసకయినా మాధురి ఒక్కనాడయినా పుట్టింటికి వెళ్లదు. డాక్టరమ్మ సలహా మేరకు రోజూ పిల్సు వేసుకుంటుంది గనక ఇప్పట్లో మా సుఖానికి పిల్లలు అడ్డుగా తయారు కారు.

ఇచ్చిపుచ్చుకోడం ఇంత ఖచ్చితంగా అభ్యసిస్తున్న మా అందాల అనుబంధాలకి అడ్డూ అపూ అంటూ ఎందుకుండాలి! ఆఫీసులో పనిచేస్తున్నా అదే తలపు నాకు. ఇంటి దగ్గిర వంట చేస్తున్నా అదే కులుకు తనకి. ఏ క్షణం ఒకరి చేతుల్లో ఒకరు ఇమిడిపోదామా అనే ధ్యాస. అందుకోసమే మా శ్వాస.

ఇలాంటి కోరిక ప్రతి పడుచు జంటలోనూ ఇదే స్థాయిలో ఉంటుందో లేదో మాకు తెలీదు. దీన్ని ప్రేమ అంటారో కామం అంటారో మే మెప్పుడూ ఆలోచించలేదు. మేమైకం చెందడమే మా లోకం. చుట్టూ మరో లోకం ఉందనే పట్టింపు కూడా మాకు అనవసరం.

కాల్చిపారేసిన సిగరెట్టు పీకల గుట్ట చూస్తే మతిపోయినట్టయింది నాకు. చాతకాని నా పరిస్థితికి నేనే ఏడుస్తుంటే గాయానికి కారం అంటించినట్టు పక్కగదిలో దెప్పిపొడవడం మరింత బాధించింది.

'వక్కపొడి అయినా నమలని నంగనాచి అనవూ నీ మొగుడు, మరి యిదేం చిన్న సిగరెట్టు పీకల కొండ సృష్టించినట్టున్నాడూ!'

'కాస్త మెల్లిగా మాటాడవే బాబూ, మళ్ళీ ఆయన చెవినపడితే బాగుండదు- అసలే ఎందుకో అదోలా ఉంది ఆయన మొహం!'

అని మాధురి సర్దిచెప్పబోతే ఆమె ఫ్రెండు వాసంతి మరింత గొంతుక పెంచి చెప్పిన జవాబు యిదీ.

"బాగుంది నీ మొగుడి మొహం ఎలా ఉంటే నాకేం. నే నొచ్చింది ఇదిగో నీ కోసం. ఈ చంద్రబింబం కోసం."

దగ్గిరకెళ్ళి చూస్తే ఆ తర్వాతి దృశ్యం తలుపు కన్నంలోంచి కనపడి మరింతగా ఒళ్ళు వేడెక్కిపోయింది నాకు. అలా అంటూ వాసంతి మాధురిని దగ్గిరగా తీసుకుని అందీఅందని ముద్దొకటి పారేసింది!

నా వస్తువు నా కళ్లముందే కొల్లగొట్టబడుతున్న భావనతో జుత్తు పీక్కున్నాను. ఇంతవరకూ రాకుండా నాలుగు రోజుల ముందే మేల్కొని ఉండవల

సిందని నన్ను నేనే తిట్టుకున్నాను.

తీయగా హాయిగా సాగుతున్న మా సంసార సాగరంలోకి నాలుగు రోజుల కిందట పెనుతుపానులా కొట్టుకొచ్చి అల్లకల్లోలంచేసి పారేసింది వాసంతి. మాధురిదీ, వాసంతిదీ ఒకే వయసూ ఒకే ఊరూ కాక ఎదురెదురిళ్ళుట. ఆ ఊళ్ళో హైస్కూలు చదువు వరకూ వాళ్ళు సహాధ్యాయినులు మెట్రిక్‌తో మాధురి చదువు ఆపేసింది వాసంతి టౌన్లో కాలేజీ చదువు పూర్తిచేసి ఇప్పుడు యూనివర్సిటీలో పీజీ చేస్తోంది. ఎంత ట్రై చేసినా పరీక్షల ఒత్తిడిలో మా పెళ్ళికి రావడం కుదర్లేదుట. ఉత్తరాలు రాసుకోడం వాళ్ళ ప్రిన్సిపల్ కాదుట. వస్తే ఒకటి రెండ్రోజుల్లో వదిలివెళ్ళడమూ వాసంతికి నచ్చదుట. ఏకంగా ఓ నెలయినా వచ్చి ఉండడం కోసం ఈ రెండేళ్లూ ట్రై చేసిందిట. ఇక ఓ సారంటూ వచ్చిపడ్డాక అంతటితో ఇంతటితో సరిపెట్టుకోడం ఆ అమ్మాయి వల్ల ఔనా!

ఇక నోరు విప్పిందంటే వాసంతికేం కొత్తా, సిగ్గా!

'ఏవండోయ్, మా మాధురి మొగుడు గారూ, మీ పేరు తెలీదు, ఇలా పిలుస్తున్నందుకు ఏమనుకోకండి. ముందే చెబుతున్నాను, గుండె రాయి చేసుకోడం ప్రాక్టీసు చేసుకోండి ఇప్పట్నుంచే. దీనికి నాకూ రెండేళ్లూ ఐదేళ్ళూ కాదు, రెండైదుల, అంటే పదేళ్ల—ఏమిటను కున్నారు, అలాంటి లాంటి వ్యవహారం కాదండోయ్, ప్రాణస్నేహం. తెలిసిందా ఒకరి వరుణ్ణి మరొకరు ఎప్రూవ్ చేసుకునేదాకా పెళ్ళిళ్లు చేసుకోకూడదని ప్రామిస్ చేసుకున్నాం కూడా. ముందే చెబితే ఎక్కడొచ్చి అడ్డుపడతానో అని చడీ చప్పుడూ లేకుండా ముడెట్టించేసుకుంది రాస్కెల్.' ఇలా చెబుతున్నప్పుడు రంగులు మారుతున్న మీ మొహం చూస్తుంటే మరిన్ని జోకులు పేల్చాలని ముచ్చటపడుతోంది నా మనసు. మరేం అనుకోరుగా! ఓహోహో! ఏం బింకం. ఏం ఠీవి, ఎంతటి మగసిరి! ఇలాంటి పెర్సనాలిటీని చూసి తన ఒరిజినాలిటీనే తాకట్టు పెట్టిందంటే నాటెటాల్ ఎ వండర్. ఇదే చనువుతో మరో చిన్న రిక్వెస్టు. మీదింకా రెండేళ్ళ సహవాసం గాని మాది పదేళ్ళపాటు ఒకటిగా మెలిగిన ప్రాణం. ఓ నెల్లాళ్ళపాటైనా దీన్తో గడిపి విరహం అంతా అహరహం రీఫిల్ చేసుకుంటే గాని నేను రిటర్న్ కాలేను. ఏ కేంపో, డ్యూటీ టూరో వేసుకుని మీరీ నెల రోజులు అలా అలా తిరిగి రండి. మమ్మల్ని మాకు వదిలెయ్యండి, మా అమ్మకదూ!" సుడిగాలిలా వచ్చి చుట్టబెట్టుకుంటానని బెదిరిస్తున్న వాసంతిని చూసి కాదు నాకు ఒళ్ళు మండింది, మాటాడుకుండా ముసిముసి నవ్వు




చిందిస్తున్న మాధురి మారిపోయిన వాలకం చూసి. 'రాత్రి గదిలోకి రాక పోతావా, అప్పుడు నీ పని చెప్పనా' అనుకున్నాను కసిగా.

కాని, అలాకూడా జరగలేదు!

మా సెక్సులైపుకి ఆ రాత్రి నాగా పెట్టేసింది మాధురి!

రెండేళ్ళ తర్వాత ఎక్కడో పెట్టదు గున పడేసిన సిగరెట్ పెట్టి తీసి ఊదేసి. తనకే అర్థమయేలా తలుపు తట్టాను. ఏ అర్థరాత్రి వేళో. రంయ్యమని తీసింది. మా మాధురి కాదు, ఆ మహాపాతకి!

"నాకు తెలుసండీ బాబూ! ఇలాంటివి నాకు అనుభవంలోకి రాలేదుగాని— ఆ మాత్రం అర్థం చేసుకోలేకపోను. మీ బాధ నాకు బోధపడింది. మరి నేనూ అదే స్థితిలో ఉండి వచ్చాను కదా! ఓ రోజు ఎడబాటుకే మీ రింత తపించిపోతే ఇన్నేళ్ళపాటు నేనెలా భరించానను కున్నారు! ఓ విధంగా మనం ప్రత్యర్థులం. మాకుగాని నాకుగాని ఒకరి పొడ ఒకరు భరించడం కష్టమే మరి! అందుకే అన్నీ ఆలోచించి ముందే హెచ్చరించాను. ఈ చుట్టుపట్ల ఉండకుండా ఊరు దాటే ఉపాయం ఏదైనా ఆలోచించమని! ఇంతా చేస్తే ఎంతా? ఒక్కటంటే ఒక్క నెల, ఇలా గిర్రున తిరిగిరాదూ! బాగా ఆలోచించండి. శీఘ్రం శ్రేయస్కరం. వస్తానూ, గుడ్ నైట్' అంటూ ఆ పీనుగ ఇంకా మేలుకొనే ఉందా? దాని మొగుడనేవాడొకడు ఇక్కడ అఘోరిస్తున్నాడని చెప్పండి' అనే నా మాట నా నోట్లోనే ఉండగా భళ్ళున నా మొహం మీదే తలుపేసేసింది! వెంటనే దాని పీక నా కసిదీరా కటుక్కున ఎందుకు కొరికాను కాదో ఇప్పటికీ నాకు బోధ పడదు!

ఏమిటి ఈ వాసంతి దారుణం!

నా ఇంట్లో ప్రవేశించి, నూటికి నూరు పాళ్ళూ నాదే అనుకున్న నా కట్టుకున్న భార్యని నైట్ శెషన్ కయినా నాకు కాకుండా చేసి, 'ఐ కాన్ట్ టాలరేట్ ఇట్. డోన్ట్ షో యువర్ ఫేస్ ఫర్ ఒన్ మన్త్. గెట్ అవుట్' అని నా మొహం మీదే చెబుతోందా! పగలంతా ఎలాగైనా ఏడవవచ్చు రాత్రయినా పక్కలోకి పనికిరాకపోతే ఎందుకండీ ఈ ఆడాళ్ళని కట్టుకుని నెలనెలా వీళ్ళ మీద ఇంత డబ్బు ఖర్చుపెట్టడం! ఇంతగా శృంగారం మప్పి ఇంతటి పొజెటివ్ హస్బెండ్‌గానన్ను తీర్చి దిద్దిందే, వరసపెట్టి ఇన్నాళ్ళు వాయి దాలు పెట్టిస్తూంటే పులుసూ కారం తింటున్న మగాడు ఎన్నాళ్ళు సహిస్తా డనుకుంటోంది! ఇంతకీ ఆహారంలా ఇది ఒకే ఒక వ్యక్తి పంచుకునే వ్యవ హారం కాదే. ఎంత ఇచ్చినా ఇంకా ఇంకా కావాలని ప్రోత్సహించి పూర్తిగా పొంది పరవశించేదే ఆ మాధురి కెలా నిద్రపడుతోందిట? రెండేళ్ళ అను భవమూ రెండు నిముషాల్లో పక్కకి నెట్టి ఎప్పుడో ఎరిగిన దాంతో ఒళ్ళు తెలీ కుండా ఊరేగడానికి దీనికి కొత్తగా వచ్చిపడిన పోగాలమేమిటని? నా కర్మ గాలి, ఆ నాలుగు రోజుల్లోనే ఇనస్పె క్షను దాపురించి, ఇంట్లో పగలు రెండు గంటలయినా ఉండడానికి కుదిరేదికాదు. ఇలా ఆఫీసు నుంచి ఇల్లు చేరానో లేదో ఫ్యాన్ ప్రత్యక్షం 'పెద్దాపిసరెందుకో అర్జంటుగా రమ్మన్నారని' ఇంట్లో చూస్తే ఇదీ వరస, వీలు చూసుకుని మాధురిని పిలిస్తే ఆ చైనాగోడగారు ప్రత్యక్షం!

'మా ఆవిడని పిలవండి. మాటాడాలి'

'మీ ఆవిడ పన్లో ఉంది, నాతో చెప్పండి.'

'మీతో కాదు, దాన్తోనే చెప్పాలి. మాధురిని ఓ సారి కేకెయ్యండి.'

'మాధురే నాతో చెప్పిందండీ! మహానుభావా, తనని కేకేస్తే ఇలా పనులో ఉన్నామా, కాస్త నువ్వే నా బదులు కనుక్కోవే అని.'

'ఆ సంగతి దాన్నే అడుగుతాను అడ్డు లేవండి.'

'నన్నే అడగండీ బాబూ.'

'మిమ్మల్ని అడిగే విషయం కాదం టూంటే.'

'నాకేం ఫరవాలేదని స్పష్టంగా చెబు తూంటే.'

'ఏమండోయ్, మమ్మల్ని ఇలా అల్లరిపెట్టడం మీకేం బాగులేదు.'

'ఎన్నాళ్ళ స్నేహమో, ఇన్నాళ్ళకి మళ్ళీ కలుసుకునే అవకాశం కలిగింది. ఆడాళ్లం, అన్నీ కలిసిన వాళ్ళం, అనేకం ఉంటాయి మాకు. మమ్మల్నో నెలపాటు ఒదిలెయ్యావయ్యా అంటే ఇలా మధ్య మధ్యని కలగజేసుకుని అల్లరి

పెట్టడం మీకు మాత్రం ఏమైనా బాగుందా?'

అన్ని విధాలా బరితెగించిన ఇంతటి మాటకారితో చమత్కారితో ఇంకెలా కొనసాగించేది! ఈ కబుర్లూ ఈవిడగారి ప్రవర్తనా చూస్తూంటే రెండ్రోజుల ప్రభావంతోనే మాటలకేనా ఆస్కారం లేకుండా చేసిందే' ఏకంగా నెల్లాళ్ళపాటు దీన్నిక్కడ ఉణ్నిస్తే ఇక శాశ్వతంగా నేను మా ఆవిడకి దూరమైనట్టే! సెక్సుకి మనస్సే ముఖ్య కేంద్రం అయితే, మనస్సు అనేది ఆడా మగా తేడాకి అతీతం కాబట్టి! శృంగార జీవితానికి లింగ భేదంతో పెద్దగా అవసరం ఏముంటుంది: ఈ దౌర్భాగ్యురాలు ఆ అమాయకురాలికి ఏ కొత్త పాఠాలు బోధిస్తోందో! ఇదెక్కడి 'లెస్బియనిజమ్' వచ్చిపడిందిరా తండ్రీ. కొంపలో!

ఏదో వంక పెట్టి నిమిషాల మీద ఈ వాసంతి ముండని ఇల్లు దాటిం చెయ్యాలని ఆ క్షణమే అతి తీవ్ర నిశ్చ యాని కొచ్చింది నా మనసు. అదృష్ట వశాత్తూ ఆ అయిదో రోజు మా ఆఫీసు ఆడిటర్ల బృందం హెడ్ ఆఫీసుకి తరలి పోయింది. అప్పటికే ఆలస్యమైన మా జీవితం ఆ మర్నాడే ఇచ్చేశారు. ఆ క్షణానికి ఎందుకో నాకే తెలీదుగాని తాత చావుబతుకుల్లో ఉన్నాడనే అందరికీ తెలిపిన అబద్ధపు మిషతో వారంరోజులు శలవు గ్రాంటు చేయించుకుని ఎన్నెన్నో స్కీములతో ఇల్లు చేరాను.

ఇల్లు చేరే సరికి వాసంతి ఇంట్లో లేదు!

ఊళ్ళోనే లేదట!!

నేను నోరు విప్పకుండానే మా ఆవిడ ఏకరువు పెట్టింది.

'దానికి నా మీద ఎంత అభిమానమో తెలుసుకోకుండా అనవసరంగా వాసంతిని కంటగించుకున్నారు. నాలో మార్పొ చ్చిందేమో గాని ఇంకా నిన్న మొన్న మా సకినేటిపల్లిలో మేమిద్దరం జట పటాలు వేసుకు తిరుగుతున్నట్టే స్వచ్ఛంగా ఉంది దాని మనసు: ఈ నాలుగు రోజులికీ నా కెన్నెన్ని కొత్త విషయాలు చెప్పిందో చెప్పదూ, చెప్పే ఉంటుంది. కాపరంలో (కన్) పీక్కు పోద్దామని కృతనిశ్చయంతో వచ్చిన మనిషి ఎన్నయినా చెబుతుంది. చెప్పద మేం ఈ పాటికి ఎన్నో నేర్పే ఉంటుంది. ఇంతకొద్ది టైములో ఇంత గాఢ ముద్రవేసిన దాని పట్టు నుంచి నిన్నెలా దక్కించుకోడమో ఏమిటో —అనుకున్నాను కసిగా.

'దాని ఊసెత్తుతేనే మీరలా గంటు మొహం పెట్టుకుంటే నేనెలా చచ్చేది! ఇల్లాలి నైనంత మాత్రాన నేనేం అకస్మాత్తుగా వయసు మీదపడి అమ్మ మ్మని అయిపోలేదు కద! ఎల్లకాలం పెళ్ళికాని అమ్మాయిలా కనపడాలని 'అందచందాలలో కిటుకులట' అనేకం

చెప్పింది. అలా అయితే మీకూ లాభమే కదా!'

గొప్ప లాభమే. ఈ నాలుగు రోజులకీ లాభం గూటిల్లోకి తెచ్చి సంసారం ఓ కొలిక్కి చేర్చింది. దీని సాయం సంత కెళ్ళిరి—అనుకున్నా.

'ఈ ఒక్క జెడ దరిద్రమేమిటే ఇంత జుత్తు ఉంచుకుని!' అంటూ రెండు జడలు వేసింది. 'ఈ మధ్య పాపిడి ఏమిటే ముసలిముత్తైదువులాగ అంటూ షోగ్గా పక్క పాపిడి తీసింది, చెవుల దుద్దులు తీయించేసి బలవంతాన రింగులు పెట్టించింది. 'ఈ మూడు ఏమిట ఏమిటే తల్లీ ఏదో తప్పు చేసిన దాన్లా' అంటూ జానెడు పైట కంటె ఎక్కువ వేస్తే పళ్ళు రాలకొడతానంది. ఇలాంటివి మీరు ఒక్కటంటే ఒక్కటైనా చెప్పారా! ఎంతో శ్రద్ధ తీసుకుని అది నన్ను జూలీలో లక్ష్మిలా తయారుచేస్తే, మీకేం తీపు దిగదీసిందా! ఇంతకే అది పేటకి ఎందుకు వెళ్ళిందను కున్నారు? బ్యూటీ క్లినిక్‌లో తెలిసిన ఫ్రెండుందిట కన్సల్టేషన్ కోసం వెళ్ళింది. రాత్రి తిరిగొచ్చేస్తుంది. ఎవరి కోసం అనుకున్నారు! నా కోసం నా తల వెంట్రుకల మెత్తదనం, తేనె రంగూ చాలా అరుదైనవట. ఇలాంటివి వంకీలు తిప్పడం సాధ్యమో కాదో శాంపిల్ తీసికెళ్ళింది. పనిలో పని అని చేతిగోళ్ళు కూడా పొట్లం కట్టి పట్టి కెళ్ళింది. తగిన నెయిల్ పాలిష్ షేడ్ ఎంత ట్రైచేసినా ఇక్కడ దొరకలేదు నుఱి. రాత్రికొచ్చేస్తానని మరీ మరీ చెప్పి వెళ్ళింది. ఈలోగా మిమ్మల్ని ప్రయాణం పెట్టుకోమంది.'

'ఆడది తన ప్రాణంకన్న ప్రేమించే ఒకే ఒక వ్యక్తి ఎవరు?' అని ప్రశ్నిస్తే ఇంకెవరు, అద్దంలో తన ప్రతిబింబమే!' అని జవాబు చెప్పారుట. ఈ సత్యాన్ని వాసంతి ఎంత చక్కగా ఎక్స్‌ప్లాయిట్ చేసుకుంది! ఇంతగా ఈ వెర్రిదాని గుండెల్లో స్థిరనివాసం ఏర్పరుచుకున్న ఆవిడ ప్రభావాన్ని విరుగుడు చెయ్యడానికి ఏ దేవుడు రక్షించగలడు! దేవుళ్ళ శక్తి ఏనాడో సన్నగిల్లి ఇలాంటి దెయ్యాలే రాజ్యమేలుతున్నాయి! దెయ్యం అనే మాట రాగానే దాని పెంపుడు కూతురు లాంటి చిల్లంగి తల్లి స్ఫురించింది. వెంట్రుకలూ, గోళ్ళూ! ఇంకేం! నా బుర్ర అతి చురుగ్గా పనిచేసి ఆపధర్మం బోధించింది. మాధురిని అతి దగ్గిరగా పిలిచి మనసు నాటేలా అతి నెమ్మదిగా బ్రెయిన్ వాష్ చేశాను. 'మీ ఫ్రెండుకి నీకై పోయినా ఇంకా పెళ్ళి అవలేదు. వాళ్ళక్క పెళ్ళికుంది గనక ఇప్పటో ఆ అవకాశమూలేదు పచ్చగా నీ సంసారం సాగుతూంటే చూడలేక చిచ్చుపెడదామని వచ్చింది మీ వాసంతి. మనం నమ్మం గాని చేతబడి ఏలుబడి చాలా



ఎక్కువగా ఉంది. ఎవరికి చిల్లంగి పెట్టాలనుకుంటామో వాళ్ళ వెంట్రుకలూ గోళ్ళూ కడుపులో పెట్టి గుడ్డబొమ్మచేసి శ్మశానంలో మంత్రంతో పాతేస్తే ఇక ఆ శాస్త్రీ అక్కడితో సరి. సిటీలో భైరవయ్యని కనుక్కోడానికే ఆవిడ వెళ్ళుండాలి. అందుకే తిరిగి వచ్చేసరికి నన్ను పొమ్మంది. 'సరేలే. నేను ఇవాళ కోణార్క్ అందుకుంటున్నాను. దేవుడే నిన్ను రక్షించాలి.'

'నేనూ మీతో వస్తానండీ' అంది మాధురి ఒణుకుతూ. అంత గట్టిగా నన్నెప్పుడూ పట్టుకోలేదు. అంత గాఢంగా ఈ మధ్య నేను కౌగిలించుకోలేదు కూడా. *